క్లుప్తంగా

గాంధీరోడ్డు విస్తరణ పనులు షురూ



విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి గాంధీ రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని గాంధీ రోడ్డు నుంచి కాణిపాకం వెళ్లే గాంధీరోడ్డు విస్తరణ పనులు మంగళవారం ప్రారంభించారు. గతంలో సంతపేట రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. అయితే గాంధీ రోడ్డులో పలు విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అడ్డుగా ఉన్నాయి. దీంతో కొన్ని చోట్ల రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తాజాగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పక్కకు తొలగించే పనులను విద్యుత్ శాఖ అధికారులు ప్రారంభించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఈ పనులను విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, అసిస్టెంట్ సిటీప్లానర్ నాగేంద్ర తదితరులు ఉన్నారు. అలాగే సంతపేట–కాణిపాకం బైపాస్ రోడ్డు వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయడంపై కూడా కమిషనర్ పరిశీలించారు. ఎక్కడెక్కడ వీధి దీపాల అవసరం ఉందో గుర్తించి, నివేదిక ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఉద్యోగ సర్వీస్ రిజిస్టర్ ఇవ్వడం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పెన్షన్ పెంపుదల కోసం ఉద్యోగ సర్వీస్ రిజిస్టర్ ఇవ్వాలని చిత్తూరులోని తపోవనం ఆశ్రమ పాఠశాల యాజమాన్యం చుట్టూ ఎన్నో ఏళ్లుగా తిరుగుతున్నా ఇవ్వడం లేదని విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను చిత్తూరు తపోవనం ఆశ్రమ పాఠశాలలో 1973 నుంచి 1984 వరకు పనిచేశానని చెప్పారు. 1984 డీఎస్సీలో ఉద్యోగం సాధించి పదవీ విరమణ చెందానని చెప్పారు. తపోవనం పాఠశాల నుంచి జెడ్పీ సర్వీస్‌కు వచ్చేందుకు సర్వీస్ రిజిస్టర్ ఇవ్వలేదన్నారు. దీంతో గత సర్వీసు ద్వారా రావాల్సిన లబ్ధి కోల్పోతున్నానని ఆవేదన చెందారు. ప్రస్తుతం తక్కువ పింఛన్ వస్తుందని.. పూర్వసర్వీసు రిజిస్టర్ అందితే పెన్షన్ పెరుగుదలకు అవకాశం ఉంటుందన్నారు. అధికారులు స్పందించి సర్వీస్ రిజిస్టర్ అందించేలా చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పీ4పై సచివాలయ సిబ్బందికి శిక్షణ

యాదమరి: జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామ సచివాలయాల సిబ్బందికి ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పెంచల రవీంద్ర మాట్లాడారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పీ4 సర్వేపై ఇచ్చిన నియమావళి ప్రకారంగా మ్యాపింగ్ చేయాలన్నారు. తద్వారా బంగారు కుటుంబాలను గుర్తించి పూర్తిస్థాయిలో వారి అవసరాలను నెరవేర్చి వారు మరింతగా అభివృద్ధి చెందడానికి సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం సర్వే శిక్షకులు మహిళ సంరక్షణ కార్యదర్శి రేష్మ డిజిటల్ సహాయకులు జగదీశ్వర రావు సచివాలయ సిబ్బందికి ఒకరోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రామరాజు రామచంద్ర, ఏఎస్ఓ ఉదయశంకర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమ్మీలు తేలాయి..



ప్రమాదకరంగా ఉన్న కమ్మీలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు–తిరుత్తణి జాతీయ రహదారిలో చిత్తూరు మండలం దిగువకండ్రిగ వద్ద బ్రిడ్జిపై కమ్మీలు తేలాయి. దీంతో వాహనాలకు కమ్మీలు తగిలి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత కొన్ని నెలలుగా ఇలానే ఉన్నా.. పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ విషయం ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డులో తేలిన కమ్మీలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ముట్టజెబితేనే మ్యుటేషన్!

చిత్తూరు నగరం ఇరువారం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తన భూమిని మ్యుటేషన్ చేసుకోవాలని నెల రోజులకుపైగా తిరుగుతున్నాడు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. తర్వాత అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలోని ఓ అధికారిని కలిశాడు. ఆ అధికారి అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడంతో దరఖాస్తుదారుడితో ఒప్పందం కుదరలేదని, దీంతో దరఖాస్తును నాలుగు రోజుల కిందట ఆన్‌లైన్‌లో రిజెక్టు చేశారని దరఖాస్తుదారుడు వాపోయాడు. ఒకరిపై ఒకరి సాకులు చెబుతున్నారని కంటతడి పెడుతున్నాడు.

- చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో రైతులకు ముట్యేషన్ కష్టాలు
- భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్న వీఆర్‌ఓలు
- ముందస్తు ఒప్పందం ఉంటేనే ఫైళ్లు కదులుతాయి
- ఇవ్వకపోతే రిజెక్ట్ చేస్తున్న వైనం
- ముప్పుతిప్పలు పడుతున్న దరఖాస్తుదారులు
- పట్టించుకోని రెవెన్యూ ఉన్నతాధికారులు



చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

ఆరు నెలలకు సంబంధించిన సమాచారం

మండలం	దరఖాస్తుల సంఖ్య	సర్వే నంబర్లు	విచారణ లోనివి	తిరస్కరించినవి
చిత్తూరు అర్బన్	792	1756	1384	228
చిత్తూరు రూరల్	1090	3149	2560	537
గుడిపాల	1329	3845	3500	163
పూతలపట్టు	1888	6830	5652	1102
యాదమరి	1016	2557	1952	333
బంగారుపాళ్యం	1126	2674	2014	615
తవణంపల్లి	1742	4466	4018	409
ఐరాల	1364	4268	3689	435

కాణిపాకం: ఎన్ని పనులు ఉన్నా.. పక్కన పెట్టి కొందరు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మ్యుటేషన్‌కు ముప్పుతిప్పలు పడుతున్నారు. వీఆర్‌ఓల కోసం కార్యాలయాల వద్ద కాచుకు కూర్చుంటున్నారు. ఈ నేపథ్యంలోనే కొందరు వీఆర్‌ఓలు దుకాణం ఓపెన్ చేశారు. ఫైల్ కదిలించేందుకు ముందస్తు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. పలుచోట్ల భారీగా ముడుపులు ఇచ్చుకుంటేనే మ్యుటేషన్ ఫైళ్లు కదులుతున్నాయి. లేకుంటే పక్కన పెట్టి కుంటిసాకులు చెబుతూ ఆన్‌లైన్‌లో రిజెక్ట్ కొట్టేస్తున్నారు.

ప్రతి కార్యాలయంలో ఇదే తంతు..

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో చిత్తూరు అర్బన్, రూరల్, గుడిపాల, పూతలపట్టు, ఐరాల, యాదమరి, తవణంపల్లి, బంగారుపాళ్యం మండలాలు ఉండగా మొత్తం 8 తహసీల్దార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడకు వివిధ సమస్యల నిమిత్తం ప్రజలు వేలాదిమంది వస్తుంటారు. జనన, మరణ, సర్వే, రేషన్‌కార్డు, భూతగాదాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ ప్రతాల కోసం ఆశ్రయిస్తుంటారు. అయితే అధికంగా మ్యుటేషన్ దరఖాస్తులు కుప్పలు, తెప్పలుగా వస్తున్నాయి.

పట్టుకోండి చూద్దాం..

క్షేత్రస్థాయిలో మ్యుటేషన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలంటే వీఆర్వో అనుమతి ఉండాలనే నిబంధన పెట్టారు. వాళ్ల అనుమతితోనే సచివాలయాల్లో దరఖాస్తులు తీసుకుంటున్నారు. లేకుంటే అక్కడే తిరస్కరిస్తున్నారు. ఈక్రమంలో చాలామంది వీఆర్వోలు దాగుడుమూతలు ఆడుతూ ప్రజల కంటికి కనిపించకుండా తిరుగుతున్నారు. కొంతమంది ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకుని అక్కడే కార్యకలాపాలు సాగిస్తున్నారు. అదనపు బాధ్యతలు, ఆఫీసులో మీటింగ్, ఫీల్డ్‌లో ఉన్నాం.. సర్వేలో ఉన్నాం.. కలెక్టరేట్‌కు వచ్చామని ఘాటు సమాధానం చెబుతున్నారు. దీంతో వారి కోసం వేచి ఉండలేక జనం విసిగిపోతున్నారు.

మ్యుటేషన్ కష్టాలు

రెండు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో అతి కష్టం మీద మ్యుటేషన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టుకుంటున్నారు. వాటిని నిర్ణీత సమయంలోపు పరిశీలించి వీఆర్వోలు తహసీల్దార్‌కు సమర్పించాలి. కానీ చాలామంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. ఆన్‌లైన్‌లో తిరస్కరిస్తున్నారు. లేకుంటే తహసీల్దార్‌కు లేనిపోని సాకులు చెప్పి దరఖాస్తును తిరస్కరించేలా చేస్తున్నారు. దీంతో సామాన్య జనం ఏళ్ల తరబడి మ్యుటేషన్‌కు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పైసలు ఇస్తే ఫైళ్లు ముందుకు..!

మ్యుటేషన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు పెట్టినప్పటి నుంచి పట్టాదారు పాసుపుస్తకం చేతికొచ్చేంత వరకు దరఖాస్తుదారులు ముప్పుతిప్పలు పడుతున్నారు. కొందరు అధికారులు భూమి విస్తీర్ణం, భూమి విలువను అంచనా వేసి భారీగా కాసులు దండుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఒక్కో మ్యుటేషన్‌కు రూ.10 వేల నుంచి రూ.2 లక్షల వరకు ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వారు అడిగినంత ఇవ్వని పక్షంలో ఫైలు చిటికెలో తిరిస్కరిస్తున్నారని పలువురు కంటతడి పెడుతున్నారు. లేకుంటే పత్రాలు సక్రమంగా లేవని, రికార్డుల్లోకి ఎక్కలేదని, ప్రభుత్వ భూమి అని, వంశపారంపర్యంగా తప్పులు ఉన్నాయని, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లేదని..కుంటి సాకులు చెబుతూ కాలం వెల్లదీస్తున్నారనే మాటలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మ్యుటేషన్‌కు వచ్చే వారికి న్యాయం చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదపుటంచున ఇలా ..!



చెరువులో ప్రమాదకరంగా ఉన్న కరెంటు స్తంభం

తవణంపల్లె: మండలంలోని నలిశెట్టిపల్లె సమీపంలోని చెరువు మధ్యలో కరెంటు స్తంభం ఏటవాలుగా వాలి ఉంది. వర్షాకాలంలో చెరువులో కొంతనీరు కూడా ఉంది. గత కొన్నేళ్లుగా ఇలానే ఏటవాలుగా ఉండడంతో ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ సర్వీసులకు 11 కేవీ లైనులో కరెంటు సరఫరా అవుతోంది. కానీ చెరువు మధ్యలో కరెంటు స్తంభం వాలి ఉండడంతో పాటు చెరువు కట్టపైనే కరెంటు తీగలు వేలాడుతున్నాయి. చెరువు కట్టపై నిత్యం వాహన చోదకులు, ప్రజలు ప్రయాణిస్తుంటారు. విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తతతోనే ప్రమాదాన్ని అరికట్టాల్సి ఉంది. ప్రమాదకరంగా ఉన్న కరెంటు స్తంభం తొలగించి చెరువు కట్టపైనే కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసి వ్యవసాయ సర్వీసులకు కరెంటు సరఫరా చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మోటార్ సైక్లిస్టులకు గాయాలు

పుంగనూరు: ద్విచక్రవాహనం అదుపు తప్పడంలో ఇద్దరు మోటార్ సైక్లిస్టులు గాయపడిన సంఘటన మంగళవారం మండలంలోని గూడూరుపల్లె వద్ద చోటుచేసుకుంది. వివరాలు..మంగళం గ్రామానికి చెందిన రైతులు శంకరప్ప(35), కేశవ(25) తమ పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో బట్టందొడ్డికి బయలుదేరారు. మార్గమధ్యంలో గూడూరుపల్లె వద్ద బైక్ అదుపు తప్పడంలో కింద పడి గాయపడ్డారు. స్థానికులు గమనించి వారిని 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చాముండేశ్వరిగా అభయం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతోంది. ఉత్సవంలో భాగంగా మంగళవారం దుర్గమాత చాముండేశ్వరి అలంకరణలో చిద్విలాసం చేశారు. గిరింపేటలోని శ్రీదుర్గాంబ దేవస్థానంలోని మూలవిరాట్‌కు ఉదయం అభిషేకం చేశారు. రాత్రి మండపంలో చాముండేశ్వరిగా కొలువుదీరి భక్తులను కటాక్షించారు. శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో లక్ష్మీనారాయణస్వామి అలంకరణ, కన్యాకపరమేశ్వరి అమ్మవారు బ్రహ్మచారిణి, వైష్ణవిదేవి అలంకరణలో భక్తులను కనువిందు చేశారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఐరాలలో..

ఐరాల: మండలంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలకు ఉదయం సాయంత్రం భక్తులు పెద సంఖ్యలో తరలివెళ్లి మొక్కులు తీర్చుకుంటున్నారు. రెండవ రోజు మంగళవారం మండల కేంద్రంలో వెలసిన పాలేటమ్మ అమ్మవారు బాలత్రిపుర సుందరిగా భక్తులు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూల విగ్రహానికి అభిషేకం, సుగంధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ నిర్వాహకులు అమ్మవారిని బాలత్రిపుర దేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పాతపాలెంలో ఓంశక్తి అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో, వైఎస్ గేటులో చాముండేశ్వరి దేవి అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు వితరణ చేశారు.



చాముండేశ్వరీ దేవిగా దుర్గమ్మ

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: వజ్రాలపురం బోయకొండ గంగమ్మ మంగళవారం గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు గంగమ్మను ప్రత్యేకంగా అంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బొమ్మాయిపల్లెకు చెందిన వేణుగోపాల్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త కృష్ణప్ప, మేనేజరు మొగిలప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలత్రిపురసుందరిదేవిగా ముత్యాలమ్మ

బంగారుపాళెం గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారు బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులను కనువిందు చేశారు. ఉదయం అమ్మవారి మూలవిగ్రహానికి పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొ న్నారు.



అలంకరణలో లక్ష్మీ నారాయణ స్వామి

లక్ష్మీదేవిగా మరగదాంబిక అమ్మవారు

కాణిపాకం: నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీమణికంఠేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మరగదాంబిక అమ్మవారు లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి లక్ష్మీదేవి అలంకరణలో అలంకరించి కొలువుదీర్చారు. అనంతరం భక్తులు భక్తిప్రపక్తులతో తరించారు.



బంగారుపాళెం:గాయత్రిదేవిగా వజ్రాలపురం బోయకొండ గంగమ్మ



బాలత్రిపుర సుందరి దేవిగా పాలేటమ్మ



గాయత్రిదేవిగా చాముండేశ్వరీదేవి



గాయత్రిదేవిగా ఓంశక్తి అమ్మవారు



బంగారుపాళెం: బాలత్రిపుర సుందరిదేవిగా ముత్యాలమ్మ

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



జొన్నగురకల్లో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మంగళవారం మండలంలోని జొన్నగురకల్లో స్వస్థ్ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మహిళలకు, వివిధ రకాల జబ్బులకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, పీహెచ్ఎన్ జీవకళ, వైద్యబృందం పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం



గ్రామస్తుల సమస్యను వింటున్న జెడ్పీ సీఈఓ

యాదమరి: మండల పరిధిలోని కాశిరాళ్ల పంచాయతీ పెరుమాళ్లపెంట గ్రామంలో జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో గత కొద్ది రోజులుగా మురుగునీరు ప్రవహించక దుర్గంధం వెదజల్లుతోందని.. సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి అక్కడి సమస్యను పరిశీలించారు. గతంలో నిర్మించిన మురుగునీటి కాలువ దెబ్బతినడంతో మురుగు నీరు ఇళ్ల ముందు ప్రవహిస్తుండడంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నట్లు గుర్తించారు. మురుగునీటి వల్ల దోమలు వృద్ధి చెంది అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఈఓ సమస్య పరిష్కారం కోసం జెడ్పీ నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో చెత్త సేకరణ సక్రమంగా జరగాలని, వాటి నిర్వహణ కోసం రిక్షా లేకుంటే వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో సంపద సృష్టి కేంద్రాలు ఉండాలని తద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పెంచల రవీంద్ర, డిప్యూటీ ఎంపీడీఓ రామరాజు రామచంద్ర, గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈఈ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, గ్రామప్రజలు పాల్గొన్నారు.

ఆగని ఏనుగుల దాడులు



పూరేడువారిపల్లె రాజేంద్ర భూమిలో ఏనుగులు విరిచేసిన కూసాలు



ఏనుగులు ధ్వంసం చేసిన అరటితోట

పులిచెర్ల(కల్లూరు): మండలంలో పంటలపై ఏనుగుల దాడులు రోజు రోజుకూ తీవ్రమవుతున్నాయి. తాజాగా మంగళవారం తెల్లవారుజామున పాతపేట పంచాయతీలో పలువురు రైతుల పంటలకు ఏనుగులు నష్టం కలిగించాయి. ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లె, కురవపల్లెలో వీటి దెబ్బకు పంట నష్టం వాటిల్లింది. పూరేడువారిపల్లెలో కల్లూరుకు చెందిన రాజేంద్రకు మామిడితోటకు ఉన్న ముళ్ల కూసాలను విరిచేసాయి. అలాగే వెంకటేశ్‌కు చెందిన అరటి చెట్లను, మరికొందరి రైతుల మామిడి కొమ్మలు విరిచేశాయి. వేరుశనగ పంటలను నాశనం చేసాయి.

13 గంటల పని విధానంపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

పలమనేరు: ఇకపై కార్మికులు రోజూ 13 గంటలు పనిచేయాలని రాష్ట్ర అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం పాస్ చేసిన బిల్లు అన్యాయమంటూ స్థానిక సీఐటీయూ నాయకులు గిరిధర్ గుప్తా ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానికంగా ఆపార్టీ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని కూలీలు, కార్మికులు కూటమి మాయమాటలు నమ్మి అధికారాన్ని కట్టబెడితే కూటమి పాలకులు కార్పొరేట్ శక్తులకు అండగా ఉంటూ కార్మికుల కడుపు కొడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే కూటమి పాలనపై తీవ్రంగా ప్రజా వ్యతిరేకత వస్తోందని, ఈ తరుణంలో ఇలాంటి దారుణమైన జీవోలతో కూటమి పతనం కావడం తథ్యమన్నారు.

భూకబ్జాలన్నీ అధికార పార్టీ నేతలవే..!

- అధికారాన్ని అడ్డు పెట్టుకుని సామాన్యుల భూములను కబ్జా చేస్తున్నారు
- దిగువమాఘంలో ఓ మాజీ ప్రతినిధి పని నిత్యం కబ్జాలే
- ఇదే గ్రామంలో ఓ మహిళా ఉద్యోగి విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతోంది
- కలెక్టర్ స్పందించి బాధితులకు న్యాయం చేయాలి
- అఖిల భారతీయ జనసంఘ్ నేతల డిమాండ్



వివేకానంద విగ్రహం ఎదుట రిలే నిరహార దీక్ష చేస్తున్న జనసంఘ్‌నాయకులు, భూ బాధితులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న భూ ఆక్రమణలను అరికట్టి బాధితులకు న్యాయం చేయాలని అఖిల భారతీయ జనసంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని వివేకానంద విగ్రహం ఎదుట జనసంఘ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరహారదీక్ష ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో భూమి కబ్జాలు రోజురోజుకు పెరుగుతోందన్నారు. అక్రమాలను కట్టడి చేయడంలో రెవెన్యూ అధికారులు దారుణంగా విఫలమవుతున్నట్లు ఆరోపించారు. అధికార పార్టీల నాయకులు కబ్జాల్లో సింహభాగం ఉన్నారని విమర్శించారు. తవణంపల్లి మండలం దిగువమాఘం గ్రామంలో ఓ మాజీ ప్రజాప్రతినిధి పెద్ద ఎత్తున భూకబ్జాలకు పాల్పడుతుండడమే ఇందుకు మంచి ఉదాహరణగా తీసుకోవచ్చన్నారు. అతనికి అధికార పార్టీ అండదండలు ఉండడంతో ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అరగొండ బడ్డుపల్లెలో ఒక రైతు కుటుంబాన్ని కొందరు అధికార బలంతో పీడిస్తున్నారని తెలిపారు. వీటిపై ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. సోమల మండలం చిన్న దేవళకుప్పంలో అంగవైకల్యం కలిగిన కుటుంబానికి చెందిన కొల్లకృష్ణయ్య భూమిని ఆక్రమించిన పాలకులు పట్టించుకోలేదన్నారు. పుంగనూరు మండలం ఆరేడుగుంట గ్రామానికి చెందిన కురబ సిగరప్పను తన పొలంలో వ్యవసాయం చేసుకోకుండా కొందరు హింసిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాలపై స్థానికంగా తహసీల్దార్‌కు, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. బాధితులకు న్యాయం చేయకపోగా, వారిపైనే తిరిగి కేసులు నమోదు చేస్తామని పోలీసులే బెదిరిస్తుండడం ఎంతవరకు న్యాయమన్నారు. దిగువమాఘం గ్రామంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నా పట్టించుకున్న వారే లేరన్నారు. కలెక్టర్ స్పందించి భూకబ్జాలపై సమగ్ర విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు సుధాకర్‌చౌదరి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బాబురాజేంద్రప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి శంకర్, భూమి కబ్జాకు గురైన బాధితులు గోపికృష్ణ, నరేంద్రబాబు, దీప, మనోజ్ కుమార్ రెడ్డి, కృష్ణమనాయుడు, చిగరప్ప, డాక్టర్ హరీష్‌చంద్ర, దుర్వాసులరెడ్డి, శ్రీహరి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.